సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



నేడు ఎస్‌పీఎల్ సెమీఫైనల్ మ్యాచ్‌లు

జేఎన్‌టీయూ జీవీ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 'సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్)' క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నవి. - 8లో



పైడితల్లి ఆలయ అభివృద్ధికి...

సాంకేతిక ప్రక్రియలు పూర్తయిన వెంటనే పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. - 8లో



గురుకుల విద్యార్థులకు పతకాలు

బొబ్బిలి గురుకుల పాఠశాల విద్యార్థులు కె.చంద్రమౌళి, డి. ధనుష్‌నాయుడు అనకాపల్లిలో గతనెల 30న జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో వెండి, రజత పతకాలు సాధించారు. వీరిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.కృష్ణ, పీఈటీ వెంకటరమణ అభినందించారు. - బొబ్బిలి

న్యూస్‌రీల్

హైదరాబాద్ వెళ్లి.. పింఛన్లు అందజేసి..



దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీను

భామిని: భామిని మండలం సొలికిరికి చెందిన దివ్యాంగులు బియ్యాల సంతోష్, బియ్యాల అప్పారావు తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామానికి రాలేకపోవడంతో వలంటీర్ ఎరుకుమజ్జి శ్రీను శనివారం హైదరాబాద్ వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశాడు. ప్రభుత్వం చేస్తున్న మేలును మరచిపోలేమని దివ్యాంగులు పేర్కొన్నారు.

మాతా శిశు మరణాలు తగ్గించడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: మాతా శిశు మరణాలు తగ్గించడమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. పార్వతీపురం గిరిజన సామాజిక భవనంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, సాలూరు మండలాల హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాల సీహెచ్‌ఓల శిక్షణ తరగతులను శనివారం పరిశీలించారు. శిశు ఆరోగ్య కార్యక్రమాలు, టీకా నిర్వహణ, హై రిస్క్‌గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణపై పలు సూచనలిచ్చారు. వైద్యసేవలు అందే తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు తిరుపతిరావు, శంకర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ ట్యాక్స్ చెల్లించకుంటే చర్యలు

పార్వతీపురంటౌన్: వాహనదారులు రోడ్ ట్యాక్స్ చెల్లించకుంటే చర్యలు తప్పని జిల్లా రవాణా అధికారి సి.మల్లిఖారునరెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పార్వతీపురం మన్యం జిల్లాల్లో సుమారు 2,651 వాహనాలు రోడ్ టాక్స్ చెల్లించకుండా తిరుగుతున్నట్టు గుర్తించామన్నారు. ఈ నెల 6 నుంచి విరివిగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

ఊరి చెరువు బాగుతో తీరెను కరువు



అభివృద్ధిచేసిన ఇప్పమానుబంద

- మిషన్ అమృత్ సరోవర్ పేరిట ఆధునికీకరణ
- జిల్లాలో 89 చెరువులు అభివృద్ధిచేయాలన్నది లక్ష్యం
- ఇప్పటికే 33 చెరువుల పనులు పూర్తి
- పనుల్లో జిల్లాకు 4 స్థానం

పాలకొండ రూరల్: చెరువు బాగుంటే ఊరు బాగుంటుందన్నది పెద్దల నానుడి. చెరువులో పుష్కలంగా నీరుంటే సాగునీటికి డోకా ఉండదు. పంటలు సమృద్ధిగా పండుతాయి. పశువుల దాహార్తి తీరుతుంది. బోర్లు, బావులు ఎండిపోవు. వాన నీటిని ఒడిసిపట్టే అవకాశం కలుగుతుంది. అందుకే.. ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. ఊరూరా చెరువులను బాగుచేస్తోంది. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనులను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయి.

లక్ష్యం ఇది..

అమృత్ సరోవర్ పథకం కింద మండలానికి 5 చొప్పున పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 75 చెరువులను ఆధునికీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అధికారులు ఓ అడుగు ముందుకు వేసి 89 చెరువులను ఆధునీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలో ప్రతిష్టాత్మంగా ప్రారంభమైన ఈ పథకం ద్వారా 4 నియోజకవర్గాల పరిధిలో 33 చెరువులను బాగుచేశారు. మిగిలిన 56 చెరువుల్లో 36 చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. మిగిలిన 20 చెరువుల పనులు సకాలంలో పూర్తి చేసేలా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

పనులు ఇలా..

చెరువుల్లో పూడిక తీయడం, చెరువుకు నీటిని అందించే ఫీడర్ చానల్స్ ఆధునీకరించడంతో పాటు నిర్ణీత ఆయకట్టుకు సాగునీరు అందేలా తూములు, గేట్లు, ప్రధాన కాలువలను బాగుచేస్తున్నారు. చెరువు కట్టలు ఆధునీకరణ, గట్లు సుందరీకరణ పనులు చేస్తున్నారు. కాలువకట్ట మరింత దృఢపర్చేలా ఫలసాయం, నీడను అందించే మొక్కలు నాటుతున్నారు. వీటితోపాటు స్థానికుల కోసం వాకింగ్‌ట్రాక్ సుందరీకరణ, రివిట్‌మెంట్ పనులపై దృష్టిపెట్టారు. ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి శతశాతం చెరువులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా యంత్రాంగం నిర్ణయించింది. డ్వామా అధికారుల పర్యవేక్షణలో శరవేగంగా పనులు చేపడుతుండడంతో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 4వ స్థానం దక్కింది.

ఒక్కో చెరువుకు రూ.2లక్షల ఖర్చు..

అమృత్ సరోవర్ కింద ప్రభుత్వం ఒక్కో చెరువుకు రూ.2 లక్షలు పైబడి వెచ్చిస్తోంది. కొన్ని చెరువుల విస్తీర్ణం, అభివృద్ధి ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ఖర్చు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా పరిధిలో దాదాపు రూ.87.66 లక్షలు ఖర్చు చేశారు. దీంతో పాటు మా ఊరు - మాచెరువు పేరిట దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేసేలా గ్రామస్థాయిలో చైతన్యపరుస్తున్నారు. అటువంటి వారి పేర్లను పనులకు పెడతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

జిల్లాలో అభివృద్ధి చేపడుతున్న చెరువుల వివరాలు ఇలా.....

మండలం	గుర్తించిన చెరువులు	పనులు జరుగుతున్నవి	పూర్తి చేసినవి
బలిజిపేట	5	0	3
భామిని	5	3	2
గరుగుబిల్లి	7	5	2
గుమలక్ష్మీపురం	8	1	3
జియ్యమ్మవలస	7	3	3
కొమరాడ	6	1	2
కురుపాం	6	3	2
మక్కువ	5	1	2
పాచిపెంట	7	4	2
పాలకొండ	7	3	2
పార్వతీపురం	5	0	3
సాలూరు	7	4	2
సీతంపేట	6	4	2
సీతానగరం	4	2	1
వీరఘట్టం	4	2	2

శాశ్వత ప్రయోజనం



నీటివనరుల అభివృద్ధితో పాటు చెరువులను శాశ్వత ప్రయోజనకరంగా రూపొందించడమే అమృతసరోవర్ పథకం లక్ష్యం. ప్రభుత్వ సహకారంతో పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం. చెరువుల్లో నీటి సామర్థ్యం పెంచేలా పనులు చేస్తున్నాం. సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. కరువు పరిస్థితులు ఉండవు. జిల్లాలో 85 శాతం మేర పనులు జరిగాయి. వివిధ దశల్లో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయించేందుకు యంత్రాంగం అహరిష్నలు శ్రమిస్తోంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, వేతనదారుల సమన్వయంతో లక్ష్యాలను పూర్తి చేస్తాం.

– కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురంమన్యం జిల్లా

'మా నమ్మకం నువ్వే జగన్'



ప్రచార కారు స్టిక్కర్లను అతికించిన డిప్యూటీసీఎం, ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: 'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచార కారు స్టిక్కర్లను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర శనివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వెంకంపేట గ్రామంలో కార్లకు సిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కోట్లాది మంది వైఎస్సార్‌సీపీ అభిమానులు, సామాన్య ప్రజానీకం నుంచి వినిపిస్తున్న ఏకైక నినాదం... 'మా నమ్మకం నువ్వే జగన్' అని పేర్కొన్నారు. తొలిసారిగా ప్రచార కార్ స్టిక్కర్స్‌ను పార్వతీపురం నియోజకవర్గం నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయం సాధించేందుకు అందరం కలిసికట్టుగా కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా జీసీసీ లక్ష్యాల సాధన

- జీసీసీ ఎమ్‌డీ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న జీసీసీ ఎమ్‌డీ సురేష్‌కుమార్

సాలూరు: జీసీసీ లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధిస్తామని జీసీసీ ఎమ్‌డీ సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జీసీసీ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. పార్వతీపురం, జి.ఎల్.పురం డివిజనల్ మేనేజర్లతో సమావేశమయ్యారు. డివిజన్ల వారీగా జీసీసీ ప్రగతి నివేదికలను డీఎమ్ మహేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.60 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు రూ.42.55 కోట్ల లక్ష్యాన్ని చేరుకున్నట్టు వెల్లడించారు. గిరిజనులకు జీసీసీ ద్వారా ప్రోత్సాహకాలు, మద్దతు ధర చెల్లిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 101 డీఆర్ డిపోల ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్నామని వివరించారు. 26 కేంద్రాల ద్వారా అటవీఉత్పత్తులు సేకరిస్తున్నామన్నారు. జి.ఎల్.పురంలో హెచ్‌పీసీఎల్ గ్యాస్ పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు 29వేల క్వింటాళ్ల ధాన్యంను కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలోని గిరిజన రైతులకు వ్యవసాయ రుణాలు కింద రూ.20.37 లక్షలు మంజూరు చేశామన్నారు. జీసీసీ సేవలను గిరిజనులకు మరింత చేరువచేయాలని కోరారు. అనంతరం కరాసవలస ఆర్‌బీకేను పరిశీలించారు. డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొరను మర్యాదపూర్వకంగా సాలూరు పట్టణంలోని ఆయన గృహంలో కలిశారు. జీసీసీ ప్రగతిపై చర్చించారు. ఆయన వెంట జీసీసీ అధికారులు రామారావు, కృష్ణప్రసాద్, దేవరాజు ఉన్నారు.

టిడ్కో ఇళ్లను సందర్శించిన జమ్మాన



టిడ్కో గృహ సముదాయాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, అధికారులు, లబ్ధిదారులు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం పరిధిలోని సారిపల్లి, సోనియానగర్‌లలో నిర్మించిన టిడ్కో గృహసముదాయాలను టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ లబ్ధిదారులతో కలిసి శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులు, మౌలిక వసతులపై ఆరా తీశారు. 2,976 ఇళ్లను మార్చినాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలకృష్ణ, సీఎల్‌టీసీ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో రుణాలు

- లీడ్‌బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్.మూర్తి



మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి

పార్వతీపురం: ప్రభుత్వ పథకాలు పొందే లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేస్తున్నట్టు లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన స్కీమ్ (విలువ ఆధారిత, లైవ్, ఫ్రెష్ ఫిష్ ఉత్పత్తుల మార్కెటింగ్)పై ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో మత్స్య శాఖ శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు ముందుగానే ఆయా సంస్థలు బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటాయని, ఆ మేరకు లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. లబ్ధిదారులు వ్యాపారాన్ని మూడేళ్లపాటు కొనసాగించాలని, మధ్యలో విరమిస్తే రుణ రాయితీ వర్తించదన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ చేపల ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో ఉందన్నారు. తలసరి వినియోగం ఏడాదికి ఎనిమిది కేజీలు మాత్రమే ఉందని, దీనిని ఇరవై కేజీలకు పెంచేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపదయోజన పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర- ఫిట్ ఆంధ్ర పథకాన్ని అమలుచేస్తోందన్నారు. రెండువేలకు పైగా జనాభా కలిగిన 66 రైతు భరోసా కేంద్రాల్లో మినీ ఫిష్ అవుట్ లెట్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. రూ.10 లక్షలు, రూ.20 లక్షలు, రూ.30 లక్షలు విలువ కలిగిన అవుట్‌లెట్స్ ఏర్పాటుకు ప్రభుత్వ బ్యాంకులు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40శాతం సబ్సిడీతో రుణాలు మంజూరుచేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే లబ్ధిదారుని వాటా చెల్లించిన 42 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరుచేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్‌కుమార్, మెప్మా ఏపీడీ సత్యంనాయుడు, ఫిషరీష్ అసిస్టెంట్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథయాత్ర



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ బొత్సఝాన్సీ

- రామతీర్థం తిరు వీధుల్లో ఊరేగిన సీతారామస్వామి
- సామివారి సన్నిధిలో వైభవంగా పండిత పరిషత్

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం శనివారం రామనామస్మరణతో మార్మోగింది. స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. రథయాత్రను కనులారా తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివారికి ఉదయం గ్రామబలిహరణం చేపట్టి శ్రీరాముడి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణం, వేదపఠనం, వైదిక సదస్యం తదితర కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం 6 గంటలకు వేద పండితులంతా పండిత పరిషత్‌ను నిర్వహించి వేదాలను భక్తిశ్రద్ధలతో పఠించారు. స్వామివారి విశేషాన్ని వివరిస్తూ మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవవిగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకరథంపై ఆశీనులు చేసి పూజలు చేశారు.

రథంపై రాములోరు...

వేద పండితుల వేదమంత్రోచ్ఛరణ, భక్తుల జయజయధ్వానాల నడుమ సీతారామ లక్ష్మణులు రామతీర్థం పురవీధుల్లో ఊరేగి వేలాది మంది భక్తులకు కనువిందు చేశారు. మూడు గంటల పాటు జరిగిన రథయాత్ర మహోత్సవంతో రామతీర్థం పులకించింది. ఆలయ ప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి ఆనవాయితీగా వస్తోన్న సీతారామునిపేట, జగ్గరాజు గ్రామస్తులు రథాన్నిలాగి రథయాత్రను ప్రారంభించారు. స్వామివారి ఊరేగింపునకు ముందు పండిత పరిషత్ వైభవంగా జరిగింది. సీతారాముల గుణగణాలను తెలియపర్చడానికి వేదపండితులు పోటీపడిన సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులను దేవస్థానం తరఫున సన్మానించారు.



రామతీర్థంలో సాగుతున్న స్వామివారి రథయాత్ర

కుటుంబ సమేతంగా..

విజయనగరం, నెల్లిమర్ల ప్రాంతాలతో పాటు ఏటీ అగ్రహారం, దన్నానపేట, తంగుడుబిల్లి, గొర్లిపేట, కొత్తపేట, సతివాడ, రామతీర్థం, ఒమ్మి, తదితర పరిసర గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి రథయాత్రను తిలకించారు. పూజాసామగ్రిని రథంపైకి విసిరి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ సీనియర్ బాలికల జట్టు కోచ్‌గా తిరుపతి


పల్ల తిరుపతి

తెర్లాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సీనియర్ బాలికల జట్టు కోచ్‌గా తెర్లాంకు చెందిన పల్ల తిరుపతి ఎంపికైనట్లు ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 9 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జాతీయ స్థాయి సీనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న రాష్ట్ర జట్టుకు కోచ్‌గా తిరుపతిని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఎంపిక చేసింది. సాఫ్ట్‌బాల్ క్రీడలో తిరుపతి జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారునిగా, జిల్లా, రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. కోచ్‌గా తిరుపతి ఎంపిక కావడం పట్ల పలువురు క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

వరి కుప్పల దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రేగిడి: మండల పరిధిలోని మజ్జిరాముడుపేట గ్రామంలో శనివారం పలువురు రైతులకు చెందిన వరికుప్పలు దగ్ధమయ్యాయి. కళ్లాల్లో వరి పంటను యంత్రంతో నూరుస్తున్న సమయంలో గడ్డి పరకలు పైకి ఎగిరి విద్యుత్ వైర్లకు తగలడంతో నిప్పులు రాలి గ్రామానికి చెందిన కొమ్ము ఎరుకునాయుడు, కొమ్ము దాలినాయుడు, కొమ్ము బాగినాయుడు, కోసూరు రాజన్న, కొమ్ము వెంకటరమణలకు చెందిన మూడు ఎకరాల వరి కుప్పలు కాలిపోయాయని వీఆర్వో గోపాలరావు, వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, వీఏఏ వినీత తెలిపారు. పాలకొండ ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందొచ్చిన సమయంలో కాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

లారీ బోల్తా - డ్రైవర్ మృతి

పాచిపెంట: మండలంలోని పి.కొనవలస జాతీయ రహదారి ఘాట్‌రోడ్డుపై శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటరమణ తెలిపిన వివరాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నుంచి క్రేన్‌కు సంబంధించిన మెటీరియల్‌తో ఓ లారీ ఖుర్దా వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారి ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి బండరాయిని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అభయ్ సాహుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108తో సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్ అభయ్‌సాహు మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్క్రాప్ సామగ్రి దగ్ధం

విజయనగరం క్రైమ్: స్థానిక లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులో ఎల్‌ఐసీ కార్యాలయం పక్కన ఉన్న నిల్వలున్న స్క్రాప్ సామగ్రి శనివారం మధ్యాహ్నం దగ్ధమైంది. టైర్లు, ప్లాస్టిక్ సామగ్రి కాలిపోతుండడం చూసిన ప్రయాణికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించారు. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ఓ సోమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రెండు గంటల పాటూ రెండు వాహనాలతో నీటిని పంపించి మంటలను చల్లార్చారు. షార్ట్ సర్క్యూట్ కానీ, ఎవరైనా మలమూత్ర విసర్జనకు వెళ్లి సిగరెట్ వంటివి విసిరేసారా అనేది తెలియాల్సి ఉంది. అయితే సుమారు లక్ష వరకూ ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని నిర్వాహకులు అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర శివారున శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో నలుగురు గాయాల పాలయ్యారు. మధ్యాహ్నం ఎస్.కోట వైపుగా వస్తున్న కారు ఆవును ఢీకొట్టిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయాల పాలయ్యారు. వీరిని ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కాలు విరిగిన బి.రాము అనే యువకుడిని విజయనగరం మహారాజ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మరో ఇద్దరు యువకులు తులసీరావు, సిద్ధ, యువతి ధన్యలకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఎస్.కోట పోలీసులు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24క్యా. 10గ్రా.)	54,930–00
బంగారం(22క్యా. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్డ్	స్కిన్‌లెస్
₹105	₹190	₹ 200

నేడు ఎస్‌పీఎల్ సెమీఫైనల్ మ్యాచ్‌లు

- జూనియర్ విభాగంలో తలపడనున్న భాస్కర్ జూనియర్ కళాశాల– పీఎస్‌ఎం వాసవి జూనియర్ కళాశాల జట్లు
- సీనియర్ విభాగంలో సెమిస్ చేరిన ఎంవీజీఆర్, సీతం ఇంజినీరింగ్, జేఎన్‌టీయూ జీవీ, మిరాకిల్ కళాశాల జట్లు


సీతం కాలేజీ, లెండీ కాలేజీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్


సెమీస్‌కు చేరిన ఎంవీజీఆర్ కళాశాల జట్టు


విజయం సాధించిన సీతం కళాశాల జట్టు


సెమీస్‌కు చేరిన జేఎన్‌టీయూ జీవీ జట్టు


విజయం సాధించిన మిరాకిల్ జట్టు

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 'సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్)' క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారంతో నాకౌట్ పోటీలు ముగిశాయి. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో సీనియర్ విభాగంలో ఎంవీజీఆర్, సీతం ఇంజినీరింగ్, జేఎన్‌టీయూ జీవీ, మిరాకిల్ కళాశాల జట్లు నాకౌట్ మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఆదివారం ఎంవీజీఆర్ జీవీ- జేఎన్‌టీయూ జీవీ కళాశాల జట్ల మధ్య తొలి సెమీఫైనల్ మ్యాచ్, మిరాకిల్ ఇంజినీరింగ్ జట్టు- సీతం ఇంజినీరింగ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. జూనియర్ విభాగంలో భాస్కర్ జూనియర్ కళాశాల - పీఎస్‌ఎం వాసవి జూనియర్ కళాశాల జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. సెమీఫైనల్లో ఎంవీజీఆర్, మిరాకిల్, జేఎన్‌టీయూ జీవీ, సీతం ఇంజినీరింగ్ జట్లు సీనియర్స్ విభాగంలో శనివారం జరిగిన నాకౌట్ మ్యాచ్‌ల్లో ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల - అవంతి సెయింట్ థెరిస్సా కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎంవీజీఆర్ కళాశాల జట్టు 32 పరుగుల తేడాతో గెలుపొందింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎంవీజీఆర్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 87 పరుగులు సాధించింది. అనంతరం 88 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అవంతి ఇంజినీరింగ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 52 పరుగులు మాత్రమే సాధించి 32 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో ఎంవీజీఆర్ జట్టు సెమీఫైనల్స్‌కు చేరింది.

నేటి మ్యాచ్‌ల షెడ్యూల్
సీనియర్స్ విభాగంలో...
ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ జట్టు – జేఎన్‌టీయూ జీవీ కళాశాల జట్టు
మిరాకిల్ ఇంజినీరింగ్ జట్టు – సీతం కళాశాల
జూనియర్ విభాగం సెమీఫైనల్స్ మ్యాచ్
రెండో సెమిస్: భాస్కర్ జూనియర్ కళాశాల – వాసవి పీఎస్‌ఎం కళాశాల

సీతం విజయదుందుభి

లెండి ఇంజినీరింగ్ కళాశాల జట్టు – సీతం ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సీతం కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన లెండి ఇంజినీరింగ్ కళాశాల జట్టు ముందుగా బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 10 ఓవర్లలో 73 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 74 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సీతం కళాశాల జట్టు 8.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 74 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు అర్హత సాధించింది.

జేఎన్‌టీయూ జైత్రయాత్ర

జేఎన్‌టీయూ జీవీ, అవంతి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో జేఎన్‌టీయూ తన జైత్రయాత్రను కొనసాగించింది. ముందుగా టాస్ గెలిచి జేఎన్‌టీయూ జీవీ బౌలింగ్ ఎంచుకోగా అవంతి జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 10 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 77 పరుగులు సాధించింది. అనంతరం 78 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన జేఎన్‌టీయూ జీవీ జట్టు 8.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 78 పరుగుల విజయ లక్ష్యాన్ని అందుకుని సెమీఫైనల్‌కు చేరుకుంది.

మిరాకిల్ భారీ స్కోర్

మిరాకిల్, అవంతి రీసెర్చ్ కళాశాల జట్ల మధ్య మధ్యాహ్నం నిర్వహించిన రెండో మ్యాచ్‌లో మిరాకిల్ జట్టు 115 పరుగుల భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మిరాకిల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 115 పరుగులు సాధించింది. అనంతరం 116 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన అవంతి కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటై 19 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో మిరాకిల్ జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది.

త్వరలోనే పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులకు అంకురార్పణ

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ఆలయ సమీప దుకాణాలు, గృహ యజమానులకు చెక్కుల అందజేత


ఆలయ సమీప దుకాణాలు, గృహ యజమానులకు చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సాంకేతిక ప్రక్రియలు పూర్తయిన వెంటనే పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. మార్చి నెల ప్రారంభం నాటికి సమీపంలోని దుకాణాలను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి సంబంధిత అభివృద్ధి పనులకు అంకురార్పణ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పైడితల్లి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు దఫాలు కమిటీ సభ్యులు సమావేశమయ్యారని, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారని వెల్లడించారు. దేవదాయ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో కూడా మాట్లాడామని.. ఈ మేరకు ఆలయ సమీపంలోని దుకాణాలు, గృహ యజమానులకు ఆర్థిక పరిహారం అందజేసేందుకు, వారి దుకాణాలను ప్రత్యామ్నాయ చోటుకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయాన్ని విస్తరించటం ద్వారా భవిష్యత్తులో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. సులభంగా దర్శన భాగ్యం లభిస్తుందన్నారు. అభివృద్ధి చర్యల్లో భాగంగా మార్చి ఒకటో తేదీ నాటికి సమీపంలోని యజమానులు వారి భవనాలను అప్పగించనున్నారని తెలిపారు. అనంతరం సంబంధిత అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని డిప్యూటీ స్పీకర్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సంపూర్ణ సహకారం అందించారని, ఆలయ కమిటీ సభ్యుల ప్రత్యేక చొరవ తీసుకున్నారని వీరభద్రస్వామి గుర్తు చేశారు.

చెక్కుల అందజేత

ఆలయ అభివృద్ధికి స్థలాలు ఇచ్చిన దుకాణాలు, గృహ యజమానులకు డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాగంగా యజమానులు వెంకటేశ్వరరావుకు రూ.11 లక్షలు, కృష్ణప్రియకు రూ.4.35 లక్షల విలువ గల చెక్కులను స్వామి అందజేశారు. సమావేశంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కిషోర్‌కుమార్, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం పాలక మండలి సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు యవర్ణ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేర విచారణలో వైద్యుల నివేదిక కీలకం


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం లీగల్: వైద్యులు చేసే క్రిమినల్ ఇన్విస్టిగేషన్ ఎవిడెన్స్ రిపోర్టులు అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. జిల్లా కోర్టు సముదాయంలో న్యాయ సేవా సదన్‌లో నల్సా వారి సహకారంతో క్రిమినల్, ఇన్విస్టిగేషన్, ఎవిడెన్సు రిపోర్టులపై వైద్యులు, వైద్యాధికారులకు, ప్రొఫెసర్లకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ నేర విచారణ, సాక్ష్యాల నివేదికలను రూపొందించే విషయంలో అవగాహన కల్పించారు. వైద్యులు ఇచ్చే నివేదికలపైనే న్యాయమూర్తి ఇచ్చే తుది తీర్పులు ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు. డాక్టర్లు ఇచ్చే నివేదికలు, కేసు పూర్వాపరాలను అనుసరించి, న్యాయమూర్తులు తీర్పులను ఇస్తారని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పు చేసిన వారు బయట తిరగకూడదని, కేసు, శిక్ష నుంచి తప్పించుకోకూడదని స్పష్టం చేశారు. నేర విచారణ, రిపోర్టులు ఇచ్చే విషయంలో డాక్టర్లు పూర్తి భాగస్వాములై ఉండాలన్నారు. దీని వల్ల నేరాల రేటు కూడా తక్కుందన్నారు. సదస్సులో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రాధారత్నం, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా, జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మికుమారి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ తదితరులు పాల్గొని, పలు అంశాలను వివరించారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

- వంతెన గోడకు ఢీకొని బోల్తా– ఇద్దరికి గాయాలు


మండ గ్రామ సమీపంలోని మలుపు వద్ద బోల్తా పడిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు

గుమ్మలక్ష్మీపురం: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు దారిచ్చే క్రమంలో వంతెన గోడను ఢీకొట్టిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు బోల్తా పడిన సంఘటన గుమ్మలక్ష్మీపురం మండలంలో శనివారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మండ గ్రామ సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగా ఎదురుగా పార్వతీపురం నుంచి నీలకంఠాపురం వెళ్లేందుకు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుకు దారిచ్చే క్రమంలో కాస్త పక్కకు జరిపి నడపటంతో అక్కడి వంతెన గోడకు బలంగా ఢీకొంది. దీంతో పల్లెవెలుగు బస్సు అక్కడికక్కడే కుడిపైపు బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 23 మంది ప్రయాణికులున్నారు. ప్రమాదంలో ప్రయాణికులు ఆరిక పావని, విజయశాంతి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యసేవలందించారు. ఈ సమాచారం తెలుసుకున్న పార్వతీపురం ఆర్టీసీ డీఎం దుర్గా సంఘటన స్థలానికి చేరుకొని బోల్తా పడిన ఆర్టీసీ బస్సును పరిశీలించారు. ప్రయాణికుల యోగక్షేమాలపై ఆరా తీశారు. తహసీల్దార్ జె.రాములమ్మ, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ షణ్ముఖరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆర్టీసీ బస్సు ప్రధాన రహదారి మధ్యలో పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా జేసీబీ సాయంతో పక్కకు నెట్టివేయించారు. ఇదే బస్సు కుడివైపునకు కాకుండా ఎడమ వైపున గల గెడ్డలో (లోయలో) పడి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

గురుదేవా ట్రస్టు సేవలు ప్రశంసనీయం


దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న మురళీధర్

కొత్తవలస రూరల్: దివ్యాంగుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న గురుదేవా చారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని కాకినాడ సీ పోర్ట్స్ సీఈఓ మెర్ల మురళీధర్ కొనియాడారు. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఆధ్వర్యంలో కాకినాడ సీ పోర్ట్స్ సంస్థ ఆర్థిక సహకారంతో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాళ్లు, చేతులు కోల్పోయిన లక్షలాది మంది అభ్యాగులకు అండగా నిలుస్తూ జగదీష్‌బాబు దేవుడయ్యారని అభినందించారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ట్రస్టు సేవల్లో భాగంగా కాకినాడ సీ పోర్ట్స్ సంస్థ ద్వారా రూ.25 లక్షల విరాళం అందించారని తెలిపారు. అనంతరం 200 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, చెవిటి మిషన్లు, వీల్‌చైర్స్, అంధులకు బ్లైండ్ స్టిక్స్ తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు.

మూగజీవాలకూ అంబులెన్స్ సేవలు


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ అంబులెన్స్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. డెంకాడ, భోగాపురం మండలాల పరిధిలో సేవలు అందించే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను డెంకాడ మండలం మోపాడలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కదలలేని, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పశువులకు అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందిస్తారన్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిన పశువులను అంబులెన్స్‌లో ఆస్పత్రులకు తరలిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పశు వైద్య శాఖ ఉప సంచాలకుడు ఎ.రామచంద్రరావు, సహాయ సంచాలకులు ఉమాశంకర్ మహాపాత్రో, జి.చక్రవర్తి, డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన పశువైద్యులు, సచివాయల పశుసంవర్ధకశాఖ సహాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకుడు శ్రీహర్ష ఆధ్వర్యంలో సీతారాములకు స్నపనం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఒత్తిడికి దూరం

నెల్లిమర్ల: పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. పట్టణంలోని వేణుగోపాలపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి నుంచే విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఫిర్యాదుల పెట్టెను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

నెల్లిమర్ల: కిశోర బాలికల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సఖి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికల విద్యకు, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు గ్రూపుల్లో చర్చించుకోవాలని సూచించారు. సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ జి. గిరిబాల, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్, ఎస్సై పి. నారాయణరావు, వైద్యాధికారి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.